www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 7 ఏప్రిల్ 2025
5
అన్నమయ్య

ఒంటిమిట్ట రాములవారి కల్యాణానికి
మంత్రి 'మండిపల్లి'కి ఆహ్వానం

ప్రజాశక్తి-చిన్నమండెం

చిన్నమండెం మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లెలోని రవాణా క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఒంటిమిట్ట ఆలయ కమిటీ అర్చకులు కలిసి కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందించి సన్మానించారు. ఈ సందర్భంగా అర్చక స్వాములు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు శ్రీ కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 11న రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని కళ్యాణానికి మంత్రిని ఆహ్వానించినట్లు తెలిపారు. తప్పక హాజరు కావాలని వారు కోరారు.

కనుల పండువగా
ధ్వజారోహణం

- వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- కల్యాణానికి తలంబ్రాల తయారీ
- శేషవాహనంపై ఊరేగిన సీతారామలక్ష్మణులు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని పురాతన చారిత్రక ప్రాశస్త్యం గల శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం ధ్వజా రోహణంతో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణబట్టర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్టాపన, ప్రాణప్రతిష్ట, నేత్రోన్మీలనం నిర్వహించామని చెప్పారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు పేర్కొన్నారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్లు వివరించారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు.

కల్యాణానికి తలంబ్రాల తయారీ ప్రారంభం

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 11న జరుగనున్న శ్రీ సీతారాముల కల్యాణం కోసం ఆలయంలో ఆదివారం తలంబ్రాల తయారీ శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న ముత్యాల తలంబ్రాల ప్యాకింగ్ కార్యక్రమం శ్రీవారి సేవకులతో టిటిడి ప్రారంభించింది. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా కల్యాణవేదిక వద్ద గల పిఎసి వద్దకు తీసుకొచ్చారు. శ్రీ సీతా రామ కళ్యాణం కోసం తలంబ్రాల తయారీకి అవస రమయ్యే పసుపు వినియోగించేందుకు ఈ నెల 3న పుసుపు దంచే కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి హాలులో బియ్యం, పసుపు, నెయ్యి కలిపి తలంబ్రాలు తయారు చేసి, తలంబ్రాలతో పాటు ముత్యం, కంకణం ఉంచి ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నారు. కడప, అన్నమయ్య జిల్లాల నుండి శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో సేవలందించేందుకు శ్రీవారి సేవకులు వచ్చారు. దాదాపు 425 మంది శ్రీవారి సేవకులు లక్షకు పైగా తలంబ్రాల ప్యాకెట్ల తయారీలో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ ప్రశాంతి, పిఆర్ఒ (ఎఫ్ఎసి) నీలిమ, ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, పాల్గొన్నారు.

విశేషంగా ఆకర్షిస్తున్న సంపూర్ణ రామాయణం సెట్టింగ్

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంపూర్ణ రామాయణం సెట్టింగ్ భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఇందులో రామాయణంలోని వివిధ ఘట్టాలను తెలియజేసే శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను ఉయ్యాలలో పవళింపజేస్తున్న దశరధుడు, కౌసల్య, సుమిత్ర, కైకేయి, విశ్వామిత్ర మహర్షి యజ్ఞ రక్షణార్థం మారీచా, సుబాహు అనే రాక్షసులను సంహరిస్తున్న శ్రీరామ లక్ష్మణులు, జనక మహారాజు సభలో శివధనస్సు విరుస్తున్న శ్రీరామచంద్రుడు, సీతారామ కళ్యాణ వైభోగం సెట్టింగులు ఆకట్టుకున్నాయి. సీతమ్మను అపహరిస్తున్న రావణాసురుడు, లంకకు వారధి కడుతున్న వానరసైన్యం, వనవాస కాలమున సూర్పనఖ అనే రాక్షసి ముక్కు చెవులను కోస్తున్న లక్ష్మణుడు, శ్రీరామ పట్టాభిషేకం తదితర కళాఖండాలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆలయం లోపల, బయట వివిధ రకాల సాంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్స్‌తో భక్తులను ఆకట్టుకునేలా వినూత్నంగా అలంకరణలు చేశారు.

తలంబ్రాలు ప్యాకింగ్ చేస్తున్న సేవకులు

రామనామస్మరణతో సాగిన కవి సమ్మేళనం

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం బమ్మెర పోతన జన్మదినం పురస్కరించుకొని కవి సమ్మేళనం ఘనంగా జరిగింది. శ్రీ పసుపులేటి శంకర్ శ్రీ భాగవతం – ప్రాశస్త్యం ను వివరించారు. శ్రీ నారాయణరెడ్డి 'రుక్మిణీ సందేశము"పోతనామాత్యులవారి రచనా రామణీయకతను, ముకుందుని ముందర రుక్మిణీరమణి అంతరంగాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ శివారెడ్డి "వేమన చరిత్ర పైన కవిత్వాన్ని చెప్పారు.

శేషవాహనంపై శ్రీ సీతారామలక్ష్మణులు

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజైన ఆదివారం రాత్రి శేషవాహనంపై సీతాలక్ష్మణ సమేత శ్రీరాములు ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. రాత్రి 7 గంటల నుండి భజన బృందాల కోలాటాల నడుమ పురవీధుల్లో వాహనసేవ నిర్వహించారు. వాహన సేవలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఇతర అధికారులు ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీసీతారామ లక్ష్మణులు

నాణ్యమైన విద్యుత్ అందించడానికి కృషి

విద్యుత్ శాఖ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి

ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ప్రజలకు, విద్యుత్ వినియోగదారులకు, రైతులకు అందుబాటులో నాణ్యమైన విద్యుత్ అందించడానికి కృషి చేస్తానని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో గృహాలకు, వ్యవసాయ రైతులకు విద్యుత్ ను ఎలా వాడాలో , విద్యుత్ ఎలా పొదుపు చేసుకోవాలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండే దానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో విద్యుత్ శాఖ కార్యాలయాలు వివరాలు తెలపండి?

జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఎస్ ఇ కార్యాలయం ఉంది.అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 4 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 11 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కార్యాలయాలున్నాయి. ఎగ్జిక్యూటివ్ కార్యాలయాలు రాయచోటి, రాజంపేట, మదనపల్లి, పీలేరు, ప్రాంతాలలో ఉన్నాయి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాలు రాయచోటి 3, పీలేరు 2, మదనపల్లి 3, రాజంపేట 3 కార్యాలయాలున్నాయి. సెక్షన్స్ 40 ఐఆర్ఎస్ 4, సబ్ ఐఆర్ఒఎస్ 5, ఎస్‌సి సెగ్మెంట్స్ 6, సెగ్మెంట్ 1, జిల్లా లో 30 మండలాలు ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సర్వీసు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సర్వీసులు ఇప్పటివరకు గృహాలకు 6,35,391, వ్యాపారాలు 66,567, పారిశ్రామిక 5,161, సాధారణ 22,400, వ్యవసాయం 1,34,463 మొత్తం ఎల్టి 8,63,982, హెచ్ టి 383, తోటలు ఎల్‌టిం హెచ్‌టి 8,64,365 ఉన్నాయి.

జిల్లాలో సబ్ స్టేషన్ ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా సబ్ స్టేషను లో 185 ఎస్ఒఎస్ ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు ఎన్ని బిగించారు?

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 33,806 స్మార్ట్ మీటర్లు బిగించారు.

విద్యుత్తును ఎలా పొదుపు చేయాలి? ఎలాంటి బలుపులు వాడాలి?

విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి మీ పై కప్పు పై సౌర పలకాలను వ్యవస్థాపించాలి. సోలార్ వాటర్ హీటర్ వ్యవస్థను వ్యవస్థాపించాలి. ఎనర్జీ స్టార్ (5 స్టార్) అర్హత గల ఉప కరణాలను కొనాలి. తక్కువ విద్యుత్ వినియోగంతో ఉపకరణాలను కొనాలి. కృత్రిమ కాంతికి బదులుగా సూర్యరశ్మిని వాడాలి. తక్కువ పవర్ లైట్‌ను (ఎల్ఈడి) బలుపును వాడాలి. ప్లాస్మాకు టీవీకి బదులుగా ఎల్ఈడి టీవీని వాడాలి. టీవీ, మానిటర్, ఫోన్ ప్రదర్శన ప్రకాశాన్ని తగ్గించాలి. మీరు ఏదైనా పని ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో కాంతిని ఆపివేయాలి.

ప్రభుత్వ కార్యాలయాలను బకాయిలు ఎంత ఉన్నాయి?

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో ఫిబ్రవరి 2 నాటికి ప్రభుత్వ కార్యాలయంలో బకాయిలు రూ.506.46 కోట్ల రూపాయలున్నాయి.

గృహాలపై వెళ్లిన విద్యుత్తు లైను తొలగించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గృహాలపై వెళ్లిన విద్యుత్ లైన్‌లను తొలగించడానికి అర్జీదారుడు ముందుగా మీ సేవా లేదా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ అధికారి అర్జీదారున్ని గృహాలపై వెళ్లిన విద్యుత్తు లైను పరిశీలించి వివాద రహిత స్థలంలో విద్యుత్తు లైన్‌ను ఏర్పాటు చేయడానికి అంచనా వేసి పై అధికారుల అనుమతి తీసుకొని దానికి అయ్యే ఖర్చును అర్జీదారునికి తెలియజేస్తారు. తదుపరి ఆ మొత్తాన్ని అర్జీదారుడు విద్యుత్ డిపార్ట్‌మెంట్‌కు చెల్లించిన తర్వాత లైను తొలగింపు పనులు చేపడటం జరుగుతుంది.

ప్రజలకు, వ్యవసాయ రైతులకు సలహాలు సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

భద్రత ప్రమాణాలు పాటిస్తూ ప్రమాదాలను నివారిద్దాం, భారీ వర్షాలు గాలులు ఉన్నప్పుడు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. తుఫాన్ సమయంలో గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ మోడ్‌లో ఉంచవలెను. కరెంట్ బోర్డులో స్విచ్‌లను తడిచేతులతో ఆన్, ఆఫ్ చేయరాదు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకోరాదు. ఇంటి పరిసరాలలో చెట్లను కరెంట్ పోల్స్ వాలిన, పడినా కరెంటు వైర్లు పడినా, తెగిన వెంటనే విద్యుత్ కార్యాలయం, కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి. గాలి వాన సమయంలో కరెంట్ లైన్ కింద ఉండరాదు. మోటర్లు వర్షం వలన నీటిలో మునిగిన పూర్తిగా తడిసిన స్టార్ట్ సర్కిట్ జరిగే ప్రమాదం ఉంది అందువలన రైతులు జాగ్రత్తగా ఉండాలి. వినియోగ దారులు తమ భవనాలు అంతర్గత వైరింగును నాణ్యత కలిగిన విద్యుత్ వైర్లు స్విచ్ పరికరాలను వాడుకోవాలి. గృహాలలోని స్విచ్ బోర్డులను పిల్లలకు అందనంత ఎత్తులో ఆమోర్చుకోవాలి. తప్పనిసరిగా ఎర్త్ పైపు ద్వారా ఎర్తింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాన్ని అరికట్టవచ్చు. డాబాలు పైన దుస్తులు ఆరవేసేటప్పుడు ఇల్లు నిర్మాణ ప్రాంతాలలో సమీపాన విద్యుత్ వైర్లు ఉంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు తెలియజేయాలి.

బిసి సమరభేరి పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాయచోటి

బిసిలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ పేర్కొన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు యుగంధర్ ఆధ్వర్యంలో అదివారం సంబేపల్లి మండలం మోటకట్ల కాలనీలో పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ ఈ నెల11న మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా పట్టణంలో కలెక్టర్ కార్యాలయం దగ్గర బిసిలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిరసన కార్యక్రమానికి భారీ సంఖ్యలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన ప్రజలంతా కలిసి పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బిసిలకు అన్ని రంగాల్లో 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్రం లోని అన్ని కలెక్టర్ ఆఫీసుల బిసి సమరభేరి ధర్నా కార్యక్రమాలను చేపట్టాలని, 11న కలెక్టరేట్ ఎదుట బిసి సమరభేరి నిర్వహించడం జరుగుతుంది అన్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల బహుజన సమాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బిసి సంఘాల నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా సెక్రెటరీ పెద్దవీటి నరసింహులు, రాయచోటి అసెంబ్లీ అధ్యక్షులు అబ్బవరం నాగేశ్వర్ పాల్గొన్నారు.

బిసి సమర బేరి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బిఎస్‌పి నాయకులు

మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ బాషా సోదరుడు
అహమ్మద్ బాషా అరెస్టు
- ముంబయి ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న కడప పోలీసులు
- నేడు కడప కోర్టులో హాజరుపరిచే అవకాశం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ డిప్యూటీ సిఎం అంజద్ బాషా సోద రుడు అహమ్మద్ బాషాను కడప పోలీసులు ఆదివారం ముంబై ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేశారు. సోమవారం కడప కోర్టులో హాజరు పరచనున్నారు. కడపలోని వినాయక నగర్‌లో స్థలం విషయంలో జరిగిన దాడికి సంబంధించిన కేసులో అహమ్మద్ బాషాపై కేసు నమోదైంది. ప్రస్తుతం కడప ఎమ్మెల్యేగా ఉన్న మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి దంపతులను దూషించిన కేసులు అహ్మద్ బాషాపై ఉన్నాయి. అలాగే టిడిపి నేతలపై సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెట్టారనే ఆరోపణలపై కూడా కేసులు నమోదయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అహమ్మద్ బాషా జిల్లాకు దూరంగా ఉంటూ వచ్చారు. కానీ ఆయనపై నమోదైన కేసులకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే ప్రచారం జోరుగా కొన సాగింది. గత వారంలో రంజాన్ పండుగ నిమిత్తం అహమ్మద్ బాషా కడపకు వచ్చారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ఆయన నివా సం వద్ద ఉండటంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే ఆలోచనతో పోలీసులు అరెస్టు చేయలేదు. శనివారం రాత్రి ముంబై నుంచి కువైట్ వెళ్లేందుకు విమానాశ్రయం చేరుకోగా, అప్పటికే లుక్ అవుట్ నోటీసులు ఆయన పైన జారీ కావడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే కడప నుంచి పోలీసులు ముంబైకి బయలుదేరి వెళ్లి అహమ్మద్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. ముంబై నుంచి రోడ్డు మార్గాన కడపకు తరలిస్తున్నారు. కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. ఈనేపథ్యంలో అహమ్మద్ బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. కడపలోని మరో పోలీస్ స్టేషన్‌లో కూడా అహమ్మద్ బాషాపై కేసు నమోదు చేశారు. ఆయనపై 232, 324, 506 సెక్షన్ల కింద కేసు నమోదైంది. సోమవారం ఉదయం కడప కోర్టులో అహమ్మద్ బాషాను హాజరపరిచిన తర్వాత మిగిలిన కేసులు పైన కూడా పిటి వారెంట్లపై అదుపులోకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇతనిపైన సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టారనే ఆరోపణలపై కూడా కేసులు ఉన్నాయి.

నేటి నుంచి ఎన్‌టిఆర్ వైద్య సేవలు బంద్

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎన్‌టిఆర్ వైద్య సేవల పథకం కింద వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రులు సోమవారం నుంచి నిలిపివేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) వైద్య సేవలు నిలిపివేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.3,500 కోట్లు బకాయి రావాల్సి ఉంది. ముఖ్యమంత్రి, ఎన్‌టిఆర్ వైద్య సేవల ట్రస్ట్ సిఇఒ అధికారులు, మంత్రుల దృష్టికి ఆర్థిక కష్టాలు తీసుకువెళ్లిన స్పందించకపోవడంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆషా ప్రతినిధులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : విద్యారంగ, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆర్జేయుపి నాయకులు కోరారు. ఆదివారం నాయకుల బృందం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భుమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సంఘం అధికార ప్రతినిధి, సీనియర్ నాయకులు వీరబ్రహ్మం సారథ్యంలో వివిధ అంశాలపై చర్చించారు.

విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ఎన్‌జిఒ హోంలో ఎపి ఎన్‌జిఒ, పెన్షనర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం జనరల్, కిడ్నీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఎపి జెఎసి చైర్మెన్ ఎస్.నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచితంగా జనరల్, కిడ్నీ వ్యాధికి సంబంధించిన వైద్య శిబిరంలో తేజస్విని ఆస్పత్రి డాక్టర్ తేజస్విని దాదాపు 72 మంది ఉద్యోగస్తులు, విశ్రాంతి ఉద్యోగులకు కిడ్నీకి సంబంధించిన అవగాహన కల్పించినట్లు తెలిపారు. షుగర్, కిడ్నీకి సంబంధించిన వ్యాధులకు ఉచిత మందులు ఇవ్వడం అందించారు. వైద్యశిబిరంలో ఎపి ఎన్‌జిఒ కార్యదర్శి రెడ్డిశేఖర్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహులు,కార్యదర్శి వెంకటరమణ, ఎన్‌జి ఒ కార్యవర్గ సభ్యులు సోమశేఖర్, వెంకటరమణ, వీరాంజనేయులు, సైఫుల్లాబాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ తేజస్విని

ప్రవాసాంధ్రుల అభిమానం వెలకట్టలేనిది :'సుగవాసి'

ప్రజాశక్తి -రాజంపేట అర్బన్

తెలుగు ప్రజల విశిష్ట పండగైన విశ్వావసు నామ సంవత్సరం ఉగాది వేడుకలను కువైట్ నగరంలో జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని, ప్రవాసాంధ్రుల అభిమానం వెలకట్టలేనిదని రాజంపేట నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. కువైట్‌లో గల్ఫ్ రాయల్, ఎన్ఆర్ఐ అసోసియేషన్, కాపు బలిజ సంఘం నాయకుల ఆహ్వానం మేరకు అబ్బాసియాలోని అస్పైర్ బిలింగోల్ స్కూల్‌లో ఉగాది సంబరాలకు ముఖ్య అతిథిగా సుగవాసి పాల్గొన్నారు. ఈ వేడుకలను రాజంపేట నియోజకవర్గం లోని సుండుపల్లి మండల కేంద్రానికి చెందిన ముడుంపాడు కందలవాండ్ల పల్లెకు చెందిన సుగవాసి యువసేన కంచనరెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుగవాసి మాట్లాడుతూ అభిమానానికి హద్దులు ఉండవని నిరూపించేందుకు ఈ వేడుకలే నిదర్శనం అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బ్రతుకుతెరువు కోసం కువైట్ కు వచ్చిన తెలుగు ప్రజలందరికీ ఏ కష్టం వచ్చినా తన వంతు సహాయ సహకారాలను అన్ని వేళలా అందించడానికి ముం దు వరుసలో ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకు ముందు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును, రాజంపేట ఇంచార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం ను కాపు సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వేడుకలు కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టిడిపి నాయకులు, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సుగవాసిని సన్మానిస్తున్న కువైట్ ప్రవాసాంధ్రులు

పెద్దశేష వాహనంపై రఘురాముడు

సర్వభూపాలుడిపై శ్రీరామచంద్రుడు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిక్షేత్రంలోని శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గొవ రోజు ఆదివారం రాత్రి 8గంటలకు స్వామివారు పెద్దశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారికి మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు సర్వభూపాల వాహనం తిరుమాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సర్వభూపాల వాహన విశిష్టత గురించి ఆలయ సలహాదారులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ సర్వప్రాణకోటికి పాలకుడిగా, భూమండలంకు చక్రవర్తిగా, భూదేవిని వరించిన భూపతి నారాయణడును నేనని, సకల రాజులకు పాలకుడు తానేనని తెలియజెప్పడం కోసం సర్వభూపాల వాహనంపై శ్రీరామచంద్రుని ఊరేగించారు. చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం అని శ్రీమద్రామాయణం మనకు స్పష్టం చేస్తుందని, ఆందుచేతనే బ్రహ్మోత్సవాల్లో సర్వభూపాల వాహనంకు విశిష్టత ఏర్పడిందన్నారు. నాలుగు స్తంభాలు నాలుగు దిక్కులుగానూ.. స్తంభంకు పైభాగమండపం ఊర్ధ్వలోకాలకు చిహ్నంగానూ.. పంచకలశములు, పంచ భూతాత్మలకు సంకేతముగాను వ్యవహరిస్తున్నారన్నారు. వాహన సేవ అనంతరం స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం ఊంజల మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 8గంటలకు పెద్దశేష వాహనసేవ కోలాహలంగా సాగింది. స్వామివారు పెద్దశేష వాహనాన్ని అధిరోహించి ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. మహిళలు పెద్దశేష వాహనంపై ఊరేగుతున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాడ వీధుల్లో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, క్రిష్ణరాజు భట్టర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దశేష వాహనంపై విహరిస్తున్న రఘురాముడు

బ్రహ్మోత్సవాల్లో నేడు :

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8గంటలకు సూర్యప్రభ వాహనం, స్నపన తిరుమంజనం, సాయంత్రం 5గంటలకు ఊంజల్ సేవ, సాయంత్రం 6:30గంటలకు చంద్రప్రభ వాహనసేవ, రాత్రి 8:30గంటలకు పల్లకీలో మోహినీ అవతారోత్సవం.

రేపు రాములోరి పెళ్లి.. చూసేద్దాం మళ్లీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం : జగదానంద కారకుడి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 8న రాత్రి జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి టిటిడి అధికారులు ముస్తాబు చేస్తున్నారు. స్థానిక తోటివీధిలో ముమ్మరంగా కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణోత్సవానికి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి వేలల్లో భక్తులు హాజరవుతుండడంతో, భక్తులను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా షెల్టర్, చలవ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

కల్యాణోత్సవ విశిష్టత..వాల్మీకిక్షేత్రంలో శ్రీ పట్టాభిరాముడు కల్యాణోత్సవానికి సీతమ్మ వారికి ప్రాధానత్య ఇస్తూ సీతమ్మ జన్మనక్షత్రమైన ఆశ్లేష నక్షత్రంలో సీతారాముల వారి కల్యాణోత్సవం నిర్వహిస్తారని సలహాదారులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. సీతమ్మ చంద్రవంశపురాజు అయిన జనకమహారాజు కుమార్తె కావడంతో చంద్రదర్శనంలో కల్యాణోత్సవం నిర్వహించడం, చంద్రవంశల ఆనవాయితీగా పాటిస్తున్నారన్నారు.

8న కల్యాణోత్సవం.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి టికెట్లు అందుబాటులో ఉన్నట్లు ఆలయ అధికారి కృష్ణమూర్తి తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.500లు చెల్లించి, టికెట్లను పొందాలని సూచించారు. టికెట్లు కావాల్సిన వారు శ్రీ పట్టాభిరామాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న కల్యాణవేదిక

ముబారక్ అలీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ముబారక్‌అలీ

ప్రజాశక్తి-కలకడ

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ముబారక్‌అలీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కలికిరి మార్కెట్ కమిటీ చైర్మన్ మాలతి ఎన్నికయ్యారు. ఈ క్రమంలో కలికిరి మార్కెటింగ్ కమిటీలో డైరెక్టర్లను ఎన్నుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో కలకడ మండలం నుంచి ముబారక్‌అలీని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఎన్నిక చేయడం సంతోషకరమని తెలిపారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం పీలేరు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి తనను డైరెక్టర్ ఎన్నుకోవడం పట్ల ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. కలికిరిలో డైరెక్టర్లుగా ఎన్నుకోబడిన వారిని ఎమ్మెల్యే దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కలకడ మండలానికి చెందిన ముబారక్‌అలీని డైరెక్టర్‌గా అనుకోవడం పట్ల మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, పార్టీ కార్యకర్తలు, స్నేహితులు, అభిమానులు, అభినందించారు.

మంత్రి నాదెండ్లను కలిసిన అతికారి కృష్ణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నాదెండ్లను సన్మానిస్తున్న జనసేన నాయకులు

తిరుమలకు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆదివారం జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట కె.ఎస్ నరసింహ పాల్గొన్నారు.

ఇంటి పట్టా ఇవ్వలేదని మహిళ ఆందోళన

ఇంటి పట్టా ఇవ్వాలని కోరుతున్న శాంతమ్మ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఇంటి పట్టా ఇవ్వలేదని స్థానిక బసినికొండకు చెందిన బి.శాం తమ్మ ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద బైఠాయించి ఆందోళనకు దిగింది. శ్రీరామనవమి సందర్భంగా పానకం తాగడానికి వచ్చిన ఆమె ఎన్‌టిఆర్ సర్కిల్లో బైఠాయించి తనకు మంజూరైన ఇంటి పట్టా ఇవ్వని కారణంగా అధికారులు బిల్లులు పెట్టడం లేదని, పునాది వరకే పనులు జరిగి ఆగి పోయాయని ఆవేదన వ్యక్తం చేసింది. విఆర్‌ఒ తీరుపై నిరసన తెలిపి తనకు పట్టా మంజూరు చేసి ఆదుకో వాలని అక్కడికి వచ్చిన ప్రజాప్రతినిధులను కోరింది. ఒకటో పట్టణ పోలీసులు బాధితురాలిని స్టేషన్ తరలించి ఇలా బహిరంగ ప్రదేశాల్లో నిరసన తెలపడం చట్ట వ్యతిరేకమని కౌన్సిలింగ్ ఇచ్చారు. విచారించి, సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని ఆమెకు చెప్పి పంపించివేశారు.

9 నుంచి గంగమ్మ జాతర

ప్రజాశక్తి-గాలివీడు

గోరాన్ చెరువు గ్రామం కుమ్మరపల్లి వద్ద ఉన్న ఆసర్ల గంగమ్మ జాతర బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నట్లు పూజారి అనిమల నాగరాజా పేర్కొన్నారు. బుధవారం రాత్రి గొల్లపల్లికి చెందిన కె.వెంకటశివ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు తిరుపతి వారిచే పార్వతీ కళ్యాణం హరికథ కాలక్షేపం కలదని పేర్కొన్నారు.

అధ్వానం మోట్నూతలపల్లి రోడ్డు

-మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజల విన్నపం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మోట్నూతలపల్లి రోడ్డు నరకాన్ని తలపిస్తోందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీకి 7కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి రెండువైపులా రోడ్లు దెబ్బతిన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి పెద్దపెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింగాల మండలంలోని పలు గ్రామాలు, పులివెందుల మండలంలోని పలు గ్రామాలు ఈ దారి నుంచి మోట్నూతలపల్లి మీదుగా కనంపల్లి వద్ద ఉన్న బెంగళూరు హైవే చేరుకునేందుకు వీలుగా ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి అరటి ఇతర వ్యవసాయ సంబంధ పండ్లు కదిరి, బెంగళూరు తదితర ప్రాంతాలకు జీపుల ద్వారా తరలిస్తుంటారు. వ్యాపారులు, ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న ఈ రోడ్డును బాగు చేయాలనే ఆలోచన ఎవరికీ లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన పులివెందులకు మోట్నూతలపల్లి గ్రామ ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ద్విచక్ర వాహనాలు, ఆటోలలో ప్రయాణిస్తుంటారు. ఈ ప్రాంతంలో అధిక శాతం రైతులు అరటి పంటను పండిస్తారు. వాటి ఎగుమతులకు లారీలు, ఐచర్ వాహ నాలు నిత్యం తిరుగుతుంటాయి. పలువురు రైతులు పొలాల అవసరం కోసం వాహనాలను ఉపయోగిస్తుంఆరు. కంకర తేలి మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. బైక్‌లు పలు సందర్భాల్లో అదుపుతప్పి కిందపడుతున్నారు. రాజకీయ నాయకులు వీటి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొం టున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలానికి పరిరక్షణ కరువు

తాగునీటి పథకాల చుట్టూ అపరిశుభ్రత

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె దేవలాలు ప్రభుత్వ కాలనీ వద్ద 7 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ప్రయివేట్ వ్యక్తులు తమ ఆక్రమణలో ఉంచుకున్నారు. ఈ స్థలంలో మంచినీటి పథకానికి సంబంధించి ఓవర్ హెడ్ ట్యాంక్, చేతి పంపు ఉన్నాయి. వీటి ఆవరణ అపరిశుభ్రతతో నిండి ఉంది. గతంలో ప్రభుత్వం 36మంది పేదలకు ఇంటి స్థలాలను పంపిణీ చేసింది. ఈ ప్రాంతంలో 7 సెంట్లు స్థలం ప్రధాన రహదారికి పక్కనే మిగులుగా ఉంది. ఇదే అదునుగా ఈ స్థలానికి పక్కన ఉన్న వ్యక్తులు దాన్ని ఆధీనంలో ఉంచుకొని వారి కార్యక లాపాలకు వినియోగించుకుంటున్నారు. మంచినీటి పథకం వద్ద అపరిశుభ్రతను గుర్తించి పంచాయతీ సిబ్బంది నోటీసులు కూడా జారీ చేశారు. అయినప్పటికీ ఏమాత్రం ఉపయోగం లేదు. ఈ స్థలాన్ని సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకుని సద్వినియోగం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ స్థలానికి సంబంధించి గ్రామ సర్పంచ్ కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పంచాయితీ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకుంటే గ్రామ పంచాయితీ, దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అల్లాడుపల్లె వద్ద బాడుగ రూములకు మంచి డిమాండ్ ఉందన్నారు. మంచినీటి పథకం ఆవరణలో అపరిశుభ్రతపై ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణితో మాట్లాడగా.. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని, అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మిగులు స్థలాన్ని పంచాయితీకి కేటాయించడం తమ పరిధిలో లేదని తెలిపారు.

నరసాపురంలో ఎడ్ల పందేలు

ప్రజాశక్తి - కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం రాములోరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఎడ్ల పందేలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలో ఆరు జతల ఎడ్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి కామిని చంద్రమోహన్‌రెడ్డి ఎడ్లు గెలుచుకున్నాయి. రెండవ బహుమతి మన్నేటి కృష్ణారెడ్డి ఎడ్లు సాధించాయి. వరుసగా అయిదు బహుమతులను అందజేశారు.

వైజిఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - సింహాద్రిపురం : వైజిఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యర్రనాగు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు అన్నదానం చేశారు. తన నానమ్మ వెంకటసుబ్బమ్మ రెండవ వర్ధంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా మండలంలోని నంద్యాలంపల్లె ఘాటు వద్ద నివాళి అర్పించారు. అనంతరం మంగపట్నం వద్ద ఉన్న అనాథ శరణాలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైజిఆర్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

విరివిగా దనియాల సాగు

- మూడేళ్ల తర్వాత రైతుల్లో ఆసక్తి-ఆశాజనకంగా ధరలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతులు దనియాల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా ధర ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంత నేలలు అనుకూలించడంతో ప్రతి రైతు ఎంతోకొంత విస్తీర్ణంలో దనియాల పంట వేయడం అలవాటు. గత కొంతకాలంగా ధరలు సరిగా లేకపోవడంతో సాగుకు రైతులు స్వస్తి పలికారు. ఇప్పుడు గిట్టుబాటు ధర లభిస్తుండడంతో దనియాల సాగుపై మక్కువ చూపుతున్నారు. అతి సులువుగా దిగుబడి వచ్చే పంటల్లో దనియాల కూడా ఒకటి. కేవలం 70రోజుల వ్యవధిలో దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. సస్యరక్షణ చర్యలు కూడా తక్కువగా ఉంటాయని పేర్కొంటున్నారు. పూతదశలో పూత మగ్గిపోకుండా కేవలం గంధకం చల్లితే చాలు దిగుబడి సజావుగా వస్తుందని రైతులు తెలిపారు. ఎకరా సాగు ఖర్చు సుమారు రూ.30 వేలు వస్తుందని వివరించారు. కాపు బాగా వస్తే ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్ల దనియాలు తయారవుతాయని రైతులు పేర్కొన్నారు. దిగుబడి ఇళ్ల చేరేవరకు గిట్టుబాటు ధర ఇలాగే ఉంటే రైతులకు కాస్త ఊరట లభిస్తుంది. కాలువల ద్వారా నీరు కూడా అందుబాటులో ఉన్న కారణంగా రైతులందరు నీటి వసతిపై ఆధారపడి దనియాల పంటను సాగు చేస్తున్నారు. రైతులకు ప్రకృతి సహకరించాలని ఆశిద్దాం.

ఘనంగా శ్రీరామనవమి వేడుకులు

- రాములోరి కల్యాణంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి దపంతులు

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి : సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి మండిపల్లి దంపతులు

శ్రీరామనవమి పురస్కరించుకొని పట్టణంలోని ఎన్‌జిఒ కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో రాష్ట్ర రవాణశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిం చారు. మంత్రికి అర్చక స్వాములు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి చెంతకు తీసుకెళ్లారు. సీతారాముల కల్యాణానికి జిల్లా నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులందరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. **కలికిరి:** మండలంలో ప్రతి గ్రామంలోనూ శ్రీరాముని ఆలయాలకు కొత్త కొత్త రంగులతో ముస్తాబ్ చేసి, సీతారాముల విగ్రహాలకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. శ్రీరామ నవమి ఉత్సవాల నిర్వహణకు కలికిరి అండే కురవపల్లికి చెందిన సిబ్బాల దినకర్ రూ.30వేలు నగదు వితరణ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నిజాం, వెంకటనారాయణరెడ్డి, చంద్ర, జ్ఞాన మూర్తి, రమణ, శబరి పాల్గొన్నారు. **మదనపల్లె :** వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, సంఘం నేతలు ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ కాలనీ టీవీ టవర్ పార్క్ వద్ద శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సద్దల జయసింహ సంఘ సభ్యులు శేఖర, ముక్కండ్ల జగదీష్, ఆరవ నిర్మలమ్మ, మాజీ కౌన్సిలర్ పులి మహాలక్ష్మి పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పట్టణంలోని శ్రీ కోదండరామ స్వామిని దర్శించు కున్నారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక ప్రకాశం రోడ్డులో, సదుం రోడ్డులోని రామాలయాలను దర్శించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్య కర్తలు, అనుబంధ సంఘాలు, మహిళలు పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని గోపాల పురం, గువ్వలవాండ్లపల్లి, కోన, కదిరాయచెరువు, నడిమిచర్ల, పాపిరెడ్డి గారిపల్లి, ముడియం వారిపల్లి, నవా బుపేట గ్రామాలలో శ్రీరామ మందిరాలను విద్యుత్ దీపాలతాలంకరించి శ్రీరామనవమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించు కున్నారు. అనంతరం రాత్రి సీతారాముల లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను చాందిని బండ్లపై ఊరేంచారు. **రామాపురం :** మండలంలోని 13 గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లి వీరాంజనేయ స్వామి దేవాలయంలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుద్ధ మల్ల పంచాయతీ మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి స్వగ్రామం ఎర్రంరెడ్డిగారిపల్లెలో తన తండ్రి మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్నారు. చిట్లూరు, హసనా పురం, కుమ్మరపల్లి, బండపల్లి సరిహ ద్దుల్లోని అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన సీతారాముల కల్యాణ వేడుకలకు వేర్వేరుగా హాజరయ్యారు. అనం తరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వెంట టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్యే వెంటా వైసిపి నాయకులు పాల్గొన్నారు. **వీరబల్లి:** ప్రతి గ్రామంలోనూ పల్లెల్లోను ప్రతి వీధి, ప్రతి వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గడికోట పంచాయతీలో ఎడబల్లిలో ఉమ్మడి రాష్ట్రాల మాజీ హైకోర్టు జడ్జి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించేయడం జరిగింది. వీరబల్లి సాయి బాబాగుడిలో మండల వైసిపి గాలివీటి మురళీ మోహన్‌రెడ్డి దంపతుల సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **గాలివీడు :** శ్రీరామనవమి సందర్భంగా గేటు వద్ద ఉన్న రామాలయం పక్కిరారెడ్డిగారి పల్లిలో ఉన్న రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి రామాలయం చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు పానకం ప్రసాదం అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. రామాలయాల వద్ద చెక్కభజనలు కోలాటాలు నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకలు ఎటువంటి సంఘటనలు జరుపుకున్న ఎస్ఐ పి.రామకృష్ణ రామాలయాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. **మదనపల్లె అర్బన్ :** సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడమే క్షత్రియ సేవా ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ సభ్యులు స్పష్టం చేశారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నీరుగట్టువారిపల్లె శ్రీచౌడేశ్వరి సర్కిల్ నందు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామిశెట్టి నీలకంఠ పాల్గొన్నారు.

మదనపల్లె : భోజనాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిలిచిపోయిన డ్రెయినేజీ పనులు

ఇళ్లకు మార్కింగ్ వేస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో జరుగుతున్న డ్రెయినేజీ పనులు నిలిచిపోయాయి. గత వైసిపి ప్రభుత్వ పాలనలో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో కొద్దిరోజులు పనులు ప్రారంభం కాలేదు. పెండింగ్ పనులు ప్రారంభించేందుకు కూటమి నాయకులు, అధికారులు కాంట్రాక్టర్లతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల ఆ పనులను ప్రారంభించారు. ఆయా పనులు కొద్ది రోజులపాటు కడప రోడ్డులో చకచకా జరిగాయి. డ్రెయినేజీ పనులు చేసేందుకు వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఉన్న కొన్ని గృహాలు రోడ్డు పరిధిలో ఉన్నాయని, వాటిని పగుల కొట్టాలని రోడ్డు భవనాల శాఖ అధికారులు కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చారు. ముందు అధికారులు మార్కింగ్ వేసిన చోటికి పగులగొట్టి ఇళ్లను మరమ్మతులు చేసుకున్నామని, మళ్లీ మార్కింగ్ వేసి గృహాలను పగులగొట్టాలని చెప్పడం ఏమిటని స్థానికులు అధికారులతో చెప్పారు. ప్రభుత్వం నుండి పరిహారం తీసుకున్నందున రోడ్డు పరిధిలో ఉన్న గృహాలను తొలగించాల్సిదేనని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మార్కింగ్ వేసిన చోటికి తొలగిస్తే డ్రెయినేజీ పనులు చేసేందుకు వీలుంటుందని చెప్పినా, అధికారుల ఆదేశాలను వారు లెక్కచేయడంలేదు. ఈ నేపథ్యంలో ఇళ్ల యాజమానులు కూటమి నాయకుల వద్దకు వెళ్లి అధికారులు మార్కింగ్ వేసిన విషయాన్ని వివరించారు. ఇందుకు స్పందించిన కూటమి నాయకులు ఇళ్ల యాజమానులకే మద్దతు పలికినట్లు సమాచారం. అధికారులు మార్కింగ్ వేసిన చోటికి యాజమానులు గృహాలను తొలగించిక పోవడంతో డ్రెయినేజీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు వెనుకడుగు వేస్తున్నారు. పనులు మధ్యలోనే ఆపేయడంతో ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వం నుండి నష్టపరిహారం తీసుకొని కూడా గృహాలను తొలగించక పోవడం దారుణమని పలువురు అంటున్నారు. అధికార పార్టీ నాయకులు ఇలాంటి విషయంలో జోక్యం చేసుకోకుండా అభివృద్ధి పనులు సజావుగా జరిగేలా చూడాలని కోరుతున్నారు. కూటమి నాయకులు, జిల్లా అధికారులు జోక్యం చేసుకొని అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలని కోరుతున్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

- ఎంబిసి రాష్ట్ర అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా

ప్రజాశక్తి - కడప అర్బన్

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని ఎంబిసి రాష్ట్ర అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా పేర్కొన్నారు. ఆదివారం ఎంబిసి స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, పేదరికం, కరువు, విద్యా, వైద్యం, ఉపాధి సమస్యలు ఉండగా ఎంతసేపు ముస్లిముల మీద ఆంక్షలు, నిబంధనలు, చట్టాలు, ఇబ్బందులకు గురిచేసేది మోడీ ఎజెండాగా మారిందని విమర్శించారు. అందులో బాబ్రీ మసీదు, ట్రిపుల్ తలాక్, ఎఆంసి, గోమాంస నిషేధం, గుడుల ముందు హలల్ ఇలా అనేక విషయాలపై ఇబ్బందులకు గురి చేసి 80 శాతం ఉన్న హిందూ సోదరుల మెప్పు పొందాలనుకోవడం అవివేక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయం, దేశంలో దాదాపు 9 వేల లక్షల ఎకరాలు వక్ఫ్ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని చూడడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 15 శాతం ఉన్న మైనారిటీలకు అభద్రత కల్పించే ఈ బిల్లు మైనారిటీల ఆస్తులుపై ప్రభుత్వ జోక్యం చేసుకొనే ఈ బిల్లు ముస్లిముల స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తుందని పేర్కొన్నారు. ఆర్టికల్ 13, 14, 25, 26 మతస్వేచ్ఛను కల్పించిందని తెలిపారు. వక్ఫ్ బోర్డు 1954 నుంచి అమలులో ఉందని, అప్పటి నుంచి అనేక మార్లు చిన్న చిన్న సవరణలు ముస్లిం మత పెద్దలు, మత గురువుల సలహాల మేరకు చేశారని చెప్పారు. కాని ఎన్‌డిఎ ప్రభుత్వం ముస్లిం గురువుల జోక్యం లేకుండా ఏక పక్షంగా స్వార్థంతో కుట్ర పూరితంగా ఈ బిల్లును ఆమోదించడం ప్రజలు ఎవరు హర్షించరని తెలిపారు. రాష్ట్రంలో 12శాతం ఉన్న మైనారిటీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన టిడిపి, జనసేన ఈ బిల్లు కు అనుకూలంగా ఓటు వేయడం సిగ్గుసేటని విమర్శించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయమని చెప్పిన మాజీ సిఎం జగన్ మోహనరెడ్డికి ఎంబిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడాలా పెద్దన్న, ప్రచార కార్యదర్శి నాగూరు కుళాయిప్ప, జిల్లా సెక్రటరీ రెడ్డయ్య, దూదేకుల సంఘ నాయకులు దస్తగిరి, సుబ్బయుడు, నూర్ బాషా, మహమ్మద్ పాల్గొన్నారు.

'నాపై బురద జల్లడం బాధాకరం'

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నిర్వహించిన రాష్ట్ర నాయకుల ప్రత్యేక టెలి కాన్ఫరెన్‌లో ఇద్దరూ కడప నాయకులు సమావేశ విషయానికి సంబంధం లేకుండా తన పై బురద జల్లడం బాధాకరమని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 సంవత్సరాల నుంచి టిడిపి గెలుపే ధ్యేయంగా సర్పంచులు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లుగా గెలిపించేందుకు తాను, తన కుటు ంబం అంకితభావంతో పని చేసిందని తెలిపారు. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, జగ న్మోహన్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్, వైసిపి ధమనకాండను ఐదేళ్లు ఎదురొడ్డి నిజా యితీగా టిడిపి కోసం పనిచేశామని పేర్కొన్నారు. పది సంవత్సరాలుగా టిడిపి జిల్లా కార్యాలయానికి తమ వంతు సహకారం అందించామని తెలిపారు. మంత్రి లోకేష్ పాదయాత్రలో అధిక ప్రయాసలకు ఓర్చి ఇటు ఆర్థికంగానూ, వేలాది మంది కార్యకర్తలతో శక్తి మేరకు ఖర్చు చేసి పాదయాత్ర విజయవంతం చేశామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని దేవసముద్రం దళితవాడలో పది లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు రాబడిన సమాచారం మేరకు తన సిబ్బందితో గస్తీ నిర్వహించగా దేవసముద్రం దళితవాడలోని మద్యన యానాదయ్య ఇంటి పక్కన గల రేకుల షెడ్డులో 10 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు తెలిపారు. విచారించగా యానాదయ్య ఇంట్లోనే నాటు సారా తయారు చేస్తున్నారని వారిలో యాదయ్య, సిద్దయ్య, సుబ్రహ్మణ్యం అనే ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా సిఐ కళావెంకట్రమణ కథనం మేరకు..కోళ్లబైలు గ్రామం, జగన్ కాలనీలో ఉంటున్న మహమ్మద్ అలీ భార్య సుమీయ(28) కుటుంబ సమస్యలపై భర్తతో గొడవ పడింది.తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితు రాలిని కిందకు దించి హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షిం చిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు గల కార ణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి..

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. స్థానిక పోకనాటి వీధిలో నివాసముంటున్న మారెడ్డి జయరామి రెడ్డి కుమారుడు మారెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి (34) ఎలక్ట్రీషియన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.గత కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రిలో చికిత్స చేయించినా తగ్గలేదు. ఇతనికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. శనివారం రాత్రి 9 నుండి 9.30గంటల మధ్యలో కుటుంబ సభ్యులు అందరూ ఇంటి ముందర ఉండగా, ఉదయ్ కుమార్ రెడ్డికి కడుపు నొప్పి ఎక్కువ ఉండడంతో భరించలేక జీవితం మీద విరక్తి చెంది చున్నీతో సీలింగ్ ఫ్యానుకి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ ఘటనపై బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఆత్మహత్యకు గల కారణాలు పోలీసులు విచారణలో తెలియాల్సి ఉంది.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఫైల్ ఫొటో)

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సత్యసాయి జిల్లా కదిరికి చెందిన బాబు తన కుమార్తె అయేషా, కోడలు రుక్సానాలతో కలిసి శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గం, పెద్దమండ్యం, కలిచర్లలోని బంధువుల ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి అదే ఆటోలో బయల్దేరారు. మార్గమధ్యంలోని కలిచర్ల చెరువుకట్టపై ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో బాబు పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గడ్డి మందు తాగి ఆరు మేకలు మృత్యువాత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని పాపక్కగారి పల్లి గ్రామంలో గడ్డి మందు తిని ఆరు మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని పాపక్కగారిపల్లెలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. రెక్క ఆడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం చిన్నబి భార్య పెంచలమ్మది. ప్రతిరోజూ మేకలను అడవికి తోలుకుని పోయి మేపుకొని తిరిగి ఇంటికి తీసుకువచ్చి వాటిని నమ్ముకుని అమ్ముకుని జీవించే నిరుపేద కుటుంబం ఆమెది. యథావిధిగా ఆమె మేకలను తొలుకొని పోగా గడ్డి మందు కలిపిన నీటిని తాగడంతో ఆరు మేకలు మృతి చెందినట్లు ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదుచేశారు. ఈ ఘటనపై పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన వెంకటయ్యరాజు అనే రైతు తన పొలంలోని పంటను రక్షించుకోవడానికి గడ్డి మందు పిచికారి చేయగా దానిని చూసుకోకుండా మేకలు తాగడంతో ఆరు మేకలు మృతి చెందాయని, మరో నాలుగు కనిపించకుండా పోయాయని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

మృతి చెందిన మేకలను చూపుతున్న బాధితులు

మేకల కాపరిపై అడవిపందులు దాడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మేకల కాపరిపై అడవి పందులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బొమ్మన చెరువు పంచాయితీ, టేకులపాలెంకు చెందిన గోపాలు భార్య సుభద్ర(45) తన కొడుకు విజయ్‌కుమార్‌తో కలిసి మేకలకు మేత కోసం అడవికి తోలుకొని వెళ్ళారు. అడవిలో ఉన్న అడవి పందులు ఒక్కసారిగా సుభద్రపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కుమారుడు విజయ్‌కుమార్ వాటి భారి నుంచి తల్లిని కాపాడి 108 లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

యువకులపై తేనేటీగలు..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె బిటి కళాశాల మైదానంలో క్రికెట్ ఆడేందుకు వెళ్లిన యువకులపై తేనెటీగలు దాడి చేశాయి. ఆదివారం జరిగిన ఈ దాడిలో స్థానిక పెద్ద మసీదు వీధిలో ఉంటున్న మహమ్మద్ గౌస్ మరో ఇద్దరు యువకులు తేనెటీగల దాడిలో గాయపడగా కుటుంబ సభ్యులు వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన సకాలంలో మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలు కుంటున్నారు.

అసంపూర్తిగా డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పల్లవోలు గ్రామ పంచాయతీలో గత వైసిపి ప్రభుత్వంలో ప్రారంభించిన వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. డిజిటల్ లైబ్రరీని రూ.16 లక్షల వ్యయంతో 690 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే ఏర్పాట్లు చేపట్టారు. వర్క్ ఫ్రం హోం విధానాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు అనంతరం మౌలిక సదుపాయాల కల్పన కోసం కూడా ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దశల వారీగా ప్రతీ గ్రామ పంచాయతీలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అప్పటిలో కొన్ని ప్రాంతాల్లో లైబ్రరీలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రభుత్వ నిధులు వృథాగా మారనున్నాయి. ఇప్పటికైనా అసంపూర్తిగా నిలిచిపోయిన భవణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.